కాలి బాట.. లాభాల వేట


కాలిబాటలు వేసిన వరి పంట


చంద్రపాడులో వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారుల

- వరి పంటలో కాలి బాటతో లాభాలు
- చీడపీడల నుంచి పంటకు రక్షణ
- దిగుబడి పెరిగే అవకాశం
- చీమకుర్తి మండలంలో రబీలో 1000 ఎకరాల్లో వరి సాగు

చీమకుర్తి రూరల్: రబీ సీజన్ ప్రారంభమైంది. చీమకుర్తి మండలంలో వరి సాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మండలంలో రబీలో సుమారు 1000 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ నేపథ్యంలో వరి సాగులో కాలి బాటతో లాభాలు పొందవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పంటలో కుదుళ్లను దగ్గరగా నాటడం వలన తెగుళ్లు ఎక్కువగా సోకే అవకాశం ఉందని, తెగుళ్ల నివారణకు వరి నాట్ల సమయంలోనే కాలి బాటలు వేసుకుంటే ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేస్తున్నారు. వరి నాట్లలో కాలిబాటలను ఏర్పాటు చేసుకోవడం వలన బహుళ ప్రయోజనాలున్నాయని వివరిస్తున్నారు.


కాలిబాటలతో ప్రయోజనాలు...

వరి సాగులో కాలిబాటల ద్వారా ముఖ్యంగా పైరుకు గాలి, సూర్యరశ్మి సక్రమంగా అంది ఏపుగా పెరుగుతుంది. తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకునేందుకు ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల దూరం కాలి బాట వేసుకోవాలి. కాలిబాటతో మొక్కల సామర్థ్యం పెరుగుతుంది. అగ్గి తెగులు, సుడిదోమ వ్యాప్తిని అదుపుచేయవచ్చు. కాలిబాట ద్వారా ఎరువులు చల్లితే పొలమంతా సమానంగా పడే అవకాశం ఉంటుంది. మొక్కలకు సేంద్రియ ఎరువు పూర్తిస్థాయిలో అందుతుంది. కిరణజన్య సంయోగక్రియ అధికంగా జరిగి మొక్కల్లో పత్రహరితం అధికంగా ఉత్పత్తి కావడంతో పంటల దిగుబడులు పెరిగే అవకాశం ఉంది. ఎలుకలను సమర్థవంతంగా అదుపు చేయవచ్చు. కోత సమయంలో పంట నేలవాలితే నిలబెట్టడానికి అనుకూలంగా ఉంటుంది.

కుచ్చులుగా నాటొద్దు...

వరి కుదుళ్లను కుచ్చులుగా నాటడం వలన పంటకు గాలి, వెలుతురు సక్రమంగా అందక పైరు పెరుగుదల మందగించడంతో పాటు చీడపీడలు త్వరగా ఆశిస్తాయి. సాధారణంగా ఎక్కువ వరి మొనలను నాటితే ఎక్కువ దిగుబడి వస్తుందని రైతులు భావిస్తుంటారు. అయితే, ఇది సరైన పద్ధతి కాదు. వరి మొనలలో సాంద్రతే కీలకం. దగ్గరగా నాటడం వల్ల మొక్కలకు అంతర వాతావరణం అనుకూలించక తెగుళ్లు ఎక్కువగా సోకే అవకాశం ఉంది.

కాలి బాటతో బహుళ ప్రయోజనాలు :



వరి పంటలో కాలిబాటలు తీయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రతి రైతు వరి పంట నాటిన మూడు రోజుల నుంచి కాలిబాటలు తీసుకోవాలి. ముఖ్యంగా పైరుకు గాలి, సూర్యరశ్మి సక్రమంగా అందడంతో పాటు ఏపుగా పెరుగుతుంది. దీంతో తెగుళ్లు, చీడపీడలు తగ్గడంతో పాటు దిగుబడులు కూడా పెరిగే అవకాశం ఉంది.

డీవీ భాస్కర్, మండల వ్యవసాయాధికారి, చీమకుర్తి

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి

మద్దిపాడు: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధే ధ్యేయంగా ప్రతి అధికారి పనిచేయాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అధ్యక్షత వహించి మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ గ్రామస్థాయి నుంచి అభివృద్ధి సాధించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు వారి శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. ప్రజా సమస్యలు, గ్రామస్థాయి రోడ్లు, సైడు కాలువల పనులు, తదితర అంశాలపై వివరణ ఇచ్చారు. గతంలో ప్రస్తావించిన సమస్యల పరిష్కారంపై మల్లవరం గ్రామ సర్పంచ్ నారా వెంకట సుబ్బారెడ్డి మాట్లాడారు. తమ గ్రామంలో విద్యుత్ బిల్లుల విషయంపై ట్రాన్స్‌కో ఏఈ నారాయణరెడ్డిని ప్రశ్నించారు. ఏఈ సమాధానమిస్తూ విద్యుత్ చార్జీల బకాయి ఉందని, ఆ బకాయిలు పూర్తిగా పంచాయతీ వారు చెల్లించలేదని తెలిపారు. వెంకటేశ్వరస్వామి ఆలయ కొండపోరంబోకును ఆక్రమించి కట్టడాల నిర్మిస్తున్న విషయంపై గతంలో చేసిన సర్వే వివరాలను రెవెన్యూ అధికారులు ఇవ్వలేదని ప్రశ్నించగా, తహసీల్దార్ వివరణ ఇచ్చారు. ఈ నెలలో రీ సర్వేపై గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, సర్వే రికార్డులను పరిశీలించి తర్వాత తెలియజేస్తామని తెలిపారు. ఘడియాపూడి గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కొలసనకోట పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భవనాల నిర్మాణం చేపట్టగా, రూ.7.5 లక్షల బిల్లులు జమైనా పంచాయతీ కార్యదర్శి, సర్పంచి తమకు ఇవ్వకుండా నెల రోజుల నుంచి ఇబ్బందిపెడుతున్నారని పంచాయతీరాజ్ ఏఈ కృష్ణమోహన్ దృష్టికి తెచ్చారు. దీనిపై ఎంపీడీవో జ్యోతి స్పందిస్తూ.. స్థానిక పంచాయతీ కార్యదర్శి అరుణను వివరణ కోరారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన బిల్లు గురించి ఎవరో మూడో వ్యక్తికి తెలియపరిచి తీసుకోవాలంటున్నారంటూ సర్పంచ్ ఆగ్రహించారు. ఇది సరైన పద్ధతేనా అంటూ నిలదీశారు. దీనిపై కార్యదర్శి రాసివ్వాలని సభాపూర్వకంగా డిమాండ్ చేశారు. స్పందించిన ఎంపీడీవో జ్యోతి నాలుగైదు రోజుల్లో బిల్లులు జమయ్యేలా చూస్తామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. సమావేశంలో మండలంలోని పలు గ్రామాల ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు, సమస్యలకు అధికారులు పరిష్కారం చూపించాలని, లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీపీ వాకా రుణ కోటిరెడ్డి హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ సుజన్ కుమార్, వైస్ ఎంపీపీ మోరబోయిన విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు వాకా కోటిరెడ్డి, పల్లకి పద్మకుమారి, అద్దేపల్లి దుర్గా భవానీ, ప్రభాకర్, బొమ్మల దేవదాసు, సర్పంచులు నారా వెంకటసుబ్బారెడ్డి, దాసరి శిల్పసౌందర్య, మద్దిరాల వెంకటేశ్వర్లు, ఆయా శాఖల మండల, గ్రామ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు

సంతనూతలపాడు: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు హెచ్చరించారు. గత నెల 30న నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన సంతనూతలపాడు మండలం మంగమూరు గ్రామానికి చెందిన తెళ్ల కోటయ్యపై కేసు నమోదు చేసి గురువారం కోర్టులో హాజరుపరచగా జడ్జి ఐదు రోజుల జైలు శిక్ష, రూ.7 వేల జరిమానా విధించినట్లు చెప్పారు. అందువలన వాహనదారులు మద్యం తాగి వాహనం నడపరాదని, తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సీఐ స్పష్టం చేశారు.

రామతీర్థంలో కార్తీక వనభోజనాలు

చీమకుర్తి: రామతీర్థంలో వచ్చే ఆదివారం కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షుడు నేలబొట్ల రామకృష్ణశాస్త్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో రామతీర్థంలో బ్రాహ్మణ అన్నదాన సత్రంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని బ్రాహ్మణులు పాల్గొనాలని కోరారు.

బూరేపల్లిలో పారిశుధ్య పనులు

మద్దిపాడు: మండలంలోని బూరేపల్లి పునరావాస కాలనీలో కాలువల్లో మురుగునీరు నిలిచి బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో దోమలకు ఆవాసంగా మారింది. కాలనీలోని పాఠశాల చుట్టూ పలువురు గేదెలను రోడ్డుపై కట్టి వేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లడంతో సర్పంచ్ భర్త శేషయ్య కాలనీలోని పూడికలు తీయించి ఆయిల్ బాల్స్ వేయించారు.

నేడు అమ్మవారి కలశ ప్రతిష్ఠ

చీమకుర్తి: సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఈ నెల 8న కలశ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. 15వ తేదీ వరకు భక్తులకు అర్చకుల చేతుల మీదుగా మాలధారణ చేస్తారని చెప్పారు. కలశ ప్రతిష్ఠ సందర్భంగా బస్టాండ్ వద్ద ఉన్న శ్రీవేణుగోపాలస్వామి ఆలయం వద్ద నుంచి గంగాజలాన్ని అమ్మవారి కలశ ప్రతిష్ఠ వేడుకలకు ఊరేగింపుగా తీసుకెళ్లే కార్యక్రమానికి భక్తులంతా హాజరుకావాలని వారు కోరారు.

మాలధారులకు అన్నదానం ప్రారంభం

చీమకుర్తి రూరల్: మండలంలోని చంద్రపాడు గ్రామంలో పాండురంగస్వామి దేవస్థానంలో దాతల ఆధ్వర్యంలో మాలధారులకు బిక్ష కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. 41 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని పాండురంగస్వామి దేవస్థానం ధర్మకర్త వాసేపల్లి శేషారెడ్డి తెలిపారు. మూడు పూటలా అన్నదానం కొనసాగుతుందని, మాలధారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదర్శ రైతుకు సన్మానం


కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఆచార్య రంగా కిసాన్ సంస్థ సభ్యులు

మద్దిపాడు: ఆచార్య రంగా జన్మదినాన్ని పురస్కరించుకుని ఆచార్య రంగా కిసాన్ సంస్థ వారు ఉత్తమ ప్రతిభ కనబరిచిన రైతు మేకల కృష్ణారెడ్డిని గురువారం ఒంగోలు రంగా భవన్లో సన్మానించారు. పొగాకు రీజినల్ కార్యాలయం, ఒంగోలు వారి సిఫార్సు మేరకు 2023 రబీ సీజన్లో మద్దిపాడు మండలంలోని గురవారెడ్డిపాలెంలో మేకల కృష్ణారెడ్డి అధికారుల సలహాలు పాటించి తక్కువ సాగు ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డిని సన్మానించి మెమొంటో, ప్రశంసపత్రం అందజేశారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఆచార్య రంగా సంస్థ వారు పాల్గొన్నారు. నగదు బహుమతి రూ.5 వేలను తిరిగి రంగా సంస్థకు రైతుల అభ్యున్నతి కోసం విరాళంగా కృష్ణారెడ్డి ఇవ్వడంతో మండలంలోని పలు గ్రామాల రైతులు కృష్ణారెడ్డికి అభినందనలు తెలిపారు.

పేద విద్యార్థికి సూర్యశ్రీ ట్రస్టు ఆర్థిక సాయం

ఒంగోలు సిటీ: ఒంగోలు సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి షేక్ సర్దార్ బాషా ఆధ్వర్యంలో వినుకొండకు చెందిన షేక్ ఇమాబీకి గురువారం ట్రస్టు కార్యాలయంలో ట్రస్ట్ చైర్‌పర్సన్ షహనాజ్ ద్వారా నీట్ కోచింగ్‌కు రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మార్లెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు రాకూడదని, ఎందరో విద్యార్థులను సూర్యశ్రీ ట్రస్ట్ ఆర్థికంగా అండగా నిలిచిందని, తల్లి చనిపోయి, తండ్రి మెకానిక్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ కుటుంబ పోషణ కష్టంగా ఉన్న ఈ దశలో సోషల్ మీడియా ద్వారా తెలుసుకొని సూర్యశ్రీ ట్రస్టును ఆశ్రయించగా దాతల సహకారంతో ఇమాబీకి ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ఇమాబీ నీట్ కోచింగ్ తీసుకుని మంచి మార్కులతో సీటు సంపాదించాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ కార్యదర్శి షేక్ సర్దార్‌బాషా మాట్లాడుతూ పేద విద్యార్థులు మంచి మార్కులతో చదువుకుంటే ఉన్నత చదువులకు తప్పకుండా ట్రస్ట్ తరఫున ఆర్థిక సాయం చేస్తామని తెలిపారు. జనసేన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా


ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు టౌన్: ప్రతి ఒక్కరూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను చేయించుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆమె ర్యాలీ ప్రారంభించారు. నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ రాకుండా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఇంటి వద్దకు వచ్చే వైద్య బృందంతో స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. క్యాన్సర్ వ్యాధిని ప్రథమ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించే సర్వేలో 18 ఏళ్లు దాటిన స్త్రీ పురుషులంతా తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సురేష్ కుమార్ చెప్పారు. ఎన్సీడీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరథి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమలరావు, హెల్ప్ టీబీ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్, ఫ్లోరోసిస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు, నర్సింగ్ విద్యార్థినులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు చీమకుర్తి విద్యార్థిని


క్రీడాకారిణిని అభినందిస్తున్న ఇన్‌చార్జి హెచ్ఎం, పీడీ

చీమకుర్తి: చీమకుర్తి జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం.కృప రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్ఎం వై.స్వరూపారాణి, పీడీ డీ స్వరూపావాణి తెలిపారు. విజయనగరం జిల్లా భోగాపురంలో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో కృప పాల్గొంటుందని చెప్పారు. ఈ సందర్భంగా గురువారం చీమకుర్తి జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినిని టీచర్లు, విద్యార్థులు అభినందించారు.

ఘనంగా అయ్యప్పస్వామి కలశ ప్రతిష్ఠ


అయ్యప్పస్వామిని ఊరేగింపుగా తీసుకొస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

చీమకుర్తి: స్థానిక హరిహరక్షేత్రంలో అయ్యప్పస్వామి కలశ ప్రతిష్ఠ వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఆలయ ట్రస్ట్ నిర్వాహకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కుటుంబ సభ్యులతో కలిసి అయ్యప్పస్వామిని నగరేశ్వరస్వామి వద్ద నుంచి ఊరేగింపుగా హరిహరక్షేత్రం వద్దకు తీసుకొచ్చారు. ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అయ్యప్పస్వామి కలశ ప్రతిష్ఠ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో అయ్యప్పస్వామి కలశ ప్రతిష్ఠ నాడు సర్వమాలలు ధరించిన భక్తులకు నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సర్వమాలలు ధరించిన భక్తులకు వారి దీక్ష పూర్తయ్యే వరకు హరిహరక్షేత్రంలో నిత్య అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ నిర్వాహకులు, వారి కుటుంబ సభ్యులు, స్థానికులు, మాలధారులు పాల్గొన్నారు.

రెండో రోజు భక్తిశ్రద్ధలతో విగ్రహారాధన


పూజల్లో పాల్గొన్న ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, తదితరులు

చీమకుర్తి: స్థానిక గరికమిట్టలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీసీతారామలక్ష్మణ సమేత హనుమాన్ విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా గురువారం రెండోరోజు వేదపండితుల చేతుల మీదుగా విగ్రహాలకు అత్యంత భక్తిశ్రద్ధలతో పుష్పాలంకరణ చేశారు. విశేష పూజలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డితో పాటు ఆలయ కమిటీ నిర్వాహకులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం స్వామివారి విగ్రహాలతో పాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించనున్నారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీర్వాదాలు స్వీకరించి తీర్థప్రసాదాలు తీసుకోవాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు.

నేడు ఎస్జీటీలకు ప్రమోషన్ కౌన్సిలింగ్

ఒంగోలు సిటీ: జిల్లాలో మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అర్హత కలిగిన ఎస్జీటీలకు ప్రమోషన్ కౌన్సిలింగ్‌ను శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిర్వహించనున్నట్లు డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న ఎస్జీటీలు తమ రిజిస్టర్, ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

లీడర్‌షిప్, ఎఫ్ఎల్ఎన్ శిక్షణలు రద్దు చేయాలి

ఒంగోలు సిటీ: శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను ప్రభుత్వం తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తోందని, అలాంటి రెసిడెన్షియల్ శిక్షణలను వెంటనే నిలిపివేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.జనార్దనరెడ్డి, డి.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఒకవైపు అపార్ నమోదు, ఆధార్ మిస్ మ్యాచ్ వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలు, మరో వైపు సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్-2 పరీక్షలు, ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్‌లు, లీడర్‌షిప్ ట్రైనింగ్‌లు, పదో తరగతి నామినల్ రోల్స్, నవంబర్ 14న మెగా పేరెంట్స్ మీటింగ్.. ఇలా ఒకదాని వెంట మరొకటి ఉపాధ్యాయులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే రెసిడెన్షియల్ శిక్షణ రద్దు చేయాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని కోరారు. శిక్షణ నాన్‌రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రెసిడెన్షియల్ శిక్షణను రద్దుచేసి నాన్ రెసిడెన్షియల్ శిక్షణను మండలస్థాయిలోగానీ, డివిజన్‌స్థాయిలోగానీ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ వనరుల కేంద్రాన్ని వినియోగించుకోవాలి

- ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి


తయారు చేసిన కషాయాన్ని పరిశీలిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి

ఒంగోలు సిటీ: రైతులంతా వ్యవసాయ వనరుల కేంద్రాన్ని వినియోగించుకోవాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి అన్నారు. గురువారం ఒంగోలు మండలం బొద్దులూరివారిపాలెంలో రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి ఆధ్వర్యంలో అక్షయ ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ కేంద్రం ద్వారా అన్ని రకాల పంటలకు ఉపయోగపడే కషాయాలు, గోత్ర ప్రమోటర్స్, పసుపు అట్టలు, లింగాకర్షణ బుట్టలు, నవధాన్య విత్తనాలు, కిచెన్ గార్డెన్ విత్తనాలు అందుబాటులో ఉంటాయని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎటువంటి రసాయనాలు వాడకుండా ప్రకృతి ద్వారా లభించే ఆకులు, ఆవుపేడ, ఆవు మూత్రం ద్వారా కషాయాన్ని తయారు చేసి రైతులకు తక్కువ పెట్టుబడుతూ ఎక్కువ ఆదాయం పొందే విధంగా పురుగు నివారణ, గ్రోత్ ప్రమోటర్స్ కేంద్రంలో ఉంచినట్లు చెప్పారు. ప్రకృతి సేద్యం చేస్తే తక్కువ ఖర్చుతో పాటు అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. రాబోవు రబీ సీజన్‌లో శనగ, వరి, మినుము, అన్ని రకాల పంటల్లో ఉపయోగపడే కషాయాలు గ్రోత్ ప్రమోటర్స్, రైతులు వినియోగించుకోవాలని, ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. యూనిట్ ఇన్‌చార్జి రాధా సింగమనేని మాట్లాడుతూ సంవత్సరం పొడవునా అన్ని రకాల కషాయాలు, ద్రావణాలు అందుబాటులో ఉంచుతామని తెలియజేశారు. యూనిట్ ఇన్‌చార్జి రాధా సింగమనేని, ప్రకృతి వ్యవసాయ టీం మన్మథ, కృష్ణవేణి, మరియమ్మ, నాని, ఐశ్వర్య, మహిళా సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో సేవా దృక్పథం


బెడన్ పవేల్ దంపతులకు నివాళులర్పిస్తున్న డీఈఓ కిరణ్‌కుమార్, తదితరులు

- డీఈఓ కిరణ్‌కుమార్

ఒంగోలు సిటీ: స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థుల్లో సేవా దృక్పథం పెంపొందించాలని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ సూచించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఒంగోలు సమగ్రశిక్ష కార్యాలయంలో గురువారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సమావేశం నిర్వహించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రారంభకులు బెడన్ పవేల్ దంపతులకు జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం తరఫున ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపయోగపడుతుందన్నారు. స్కౌట్స్ మాస్టర్లు, గైడ్‌కెప్టెన్‌లు ఎలాంటి ఫలితం ఆశించకుండా స్వచ్ఛందంగా తమ సొంత నిధులు ఖర్చు పెట్టి సేవ చేయడం అభినందనీయమన్నారు. ప్రతి పాఠశాలలో బాలుర కోసం స్కౌట్స్ విభాగాన్ని, బాలికల కోసం గైడ్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని డీఈఓ పిలుపునిచ్చారు. జిల్లాలో స్కౌటింగ్‌ను విస్తరించడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రకాశం జిల్లా సెక్రటరీ టి.బాలాజీ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ మొదలై 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా వజ్రోత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగా మన రాష్ట్రంలో కూడా ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలను ప్రభుత్వం ప్రకటించిన విధంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. స్కౌటింగ్‌లో విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పించడం, దేశభక్తి పెంపొందించడం, సామాజిక సేవ, జాతీయ సమైక్యత, ప్రథమ చికిత్స, సిగ్నలింగ్ సాహసకృత్యాలతో పాటు జీవన నైపుణ్యాలు పెంపొందించబడతాయని తెలిపారు. సమావేశంలో జిల్లా కోశాధికారి పర్రె వెంకటరావు, జిల్లా ట్రైనింగ్ కమిషనర్ కె.వెంకటశేషారావు, డిస్ట్రిక్ట్ ఆర్గనైజింగ్ కమిషనర్ బి.హెప్సిబా, జిల్లా కార్యవర్గ సభ్యులు, స్కౌట్ మాస్టర్స్ కె.రాము, చెక్క వెంకటేశ్వర్లు, పావళ్ల రాచయ్య, కర్ర దేవసహాయం, కె.పద్మశ్రీ, అపర్ణ, రత్నకుమార్, ఎం.పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలి

- డీఈఓ కిరణ్‌కుమార్

ఒంగోలు సిటీ: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ గురువారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. ఉన్న తక్కువ సమయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని, విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించేందుకు వీలవుతుందన్నారు. స్లో లెర్నర్లను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని రోజూ ఉదయం ఒక స్లిప్ టెస్ట్, మధ్యాహ్నం మరొక స్లిప్ టెస్ట్ నిర్వహించాలన్నారు. స్లిప్ టెస్ట్‌లో విద్యార్థులు పొందే మార్కుల ఆధారంగా స్లోలెర్నర్లకు ప్రత్యేక బోధన చేయాలన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులను అప్పుడప్పుడూ ఆహ్వానించి వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులందరూ వేకువ జామున నిద్రలేచి చదువుకునే అలవాటు పెంపొందింపజేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల గృహాలను సందర్శించి వారి తల్లిదండ్రులతో విద్యార్థుల ప్రగతిపై చర్చించాలన్నారు. విద్యార్థులు రోజూ పాఠశాలకు హాజరయ్యే విధంగా, విద్యార్థుల్లో పరీక్షలంటే భయాన్ని పోగొట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు. దాతల సహకారంతో విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందించేందుకు కృషి చేయాలని చెప్పారు. ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు వారి పరిధిలోని అన్ని పాఠశాలలను తరుచూ సందర్శించి పదో తరగతి విద్యార్థులకు అందుతున్న ప్రత్యేక బోధనను పరిశీలించాలన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మనబ్రోలు బాలికల రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వసతులను పరిశీలించారు. వంట గది, సరుకుల భద్రత గదిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ బాలికలకు బంగారు భవిష్యత్తు అందించే గురుకులాల్లో ఆహారంలో నాణ్యతా లోపం లేకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. హాస్టల్లో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఫుడ్ కమిషన్ చైర్మన్‌ను స్థానిక తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. పరిశీలనలో పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, సిబ్బంది ఉన్నారు.

స్క్రీనింగ్ పరీక్ష పక్కాగా నిర్వహించాలి

ఒంగోలు అర్బన్: డీఎస్సీలో శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకున్న షెడ్యూల్ కులాలు, తెగల అభ్యర్థులకు ఈ నెల 10వ తేదీన స్క్రీనింగ్ పరీక్ష పక్కాగా నిర్వహించాలని డీఆర్ఓ ఓబులేసు అధికారులకు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్క్రీనింగ్ పరీక్షపై సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రెసిడెన్షియల్ విధానంలో ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో 583 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. వీరికి జిల్లాలో మూడు కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష నిర్వహించే సమయంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిలో సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, డీఎంహెచ్ఓ సురేష్, విద్యుత్, పోలీసు, రవాణాశాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్యం కోసం వచ్చి ప్రాణాలు కోల్పోయింది

ఒంగోలు టౌన్: జ్వరంతో ఆస్పత్రిలో చేరిన యువతికి సరైన వైద్యం అందక మరణించిన ఘటన ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో గురువారం జరిగింది. మృతురాలి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. కనిగిరికి చెందిన షేక్ మహబూబ్ బాషా, హలీమా దంపతుల కూతురు మొబీనా (21) జ్వరంతో బాధపడుతుండటంతో బుధవారం ఒంగోలులోని సత్యనారాయణపురం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొచ్చారు. మధ్యాహ్నం ఆమెకు ఒక్కసారిగా ప్లేట్‌లెట్స్ తగ్గిపోయాయి. రక్తపోటు పడిపోయింది. దీంతో వెంటనే నగరంలోని ఒక కార్పొరేట్ వైద్యశాలకు తరలించారు. మార్గంమధ్యలోనే మొబీనా మరణించింది. వైద్యులు సక్రమంగా వైద్యం చేయలేదని, రక్తపరీక్షల పేరుతో వేల రుపాయలు కాజేయడంపై చూపిన శ్రద్ధ వైద్యం అందించడంలో చూపించలేదని మృతురాలి తల్లిదండ్రులు మహబూబ్ బాషా, హలీమా ఆరోపించారు. డాక్టర్ల నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ ప్రాణాలు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే తమ కూతురిని కార్పొరేట్ వైద్యశాలకు తరలించారని అనుమానం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని నిరసనకు దిగారు. దీంతో ఆస్పత్రి ప్రాంగాణంలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని శాంతింపజేశారు. వైద్యం విషయంలో తామెలాంటి నిర్లక్ష్యం చేయలేదని, ప్లేట్‌లెట్లు పడిపోవడంతోనే మొబీనా మరణించిందని ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు.

పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

చీమకుర్తి రూరల్: రైతులు పొగాకు సాగు తగ్గించుకోవాలని, ప్రత్యామ్నాయ పంటలైన శనగ, మినుము, పెసర, సజ్జ, రాగి, జొన్న, తదితర పంటలు సాగుచేయాలని చీమకుర్తి మండల వ్యవసాయాధికారి డి.వి.భాస్కర్ సూచించారు. గురువారం మండలంలోని కె.వి.పాలెం రైతు భరోసా కేంద్రం వద్ద పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.